
సాక్షి
గుంటూరు
మంగళవారం । 12 । మార్చి । 2024



రూ.14.25 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయ చిన్న తిరునాళ్ల సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహణకు సోమవారం నిర్వహించిన వేలంలో రూ.14.25 లక్షల ఆదాయం వచ్చింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఏఎస్పీ విఠలేశ్వర్ బాధ్యతల స్వీకారం



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీగా బదిలీ అయినా టి.పి.విఠలేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందజేశారు.



సమగ్రాభివృద్ధే ధ్యేయం

గుంటూరు నగర బడ్జెట్ రూపకల్పన
- రూ.1497.14కోట్లతో పనులు
- ప్రజారోగ్యానికి, తాగునీటికి ప్రాధాన్యం
- మౌలిక వసతులకు పెద్దపీట
- కొన్ని మార్పులు, చేర్పులతో బడ్జెట్ ఆమోదం



గుంటూరు కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగర సమగ్రాభివృద్ధే ధ్యేయం లక్ష్యంగా కార్పొరేషన్ బడ్జెట్ రూపకల్పన చేసినట్లు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశానికి నగర మేయర్ కావటి అధ్యక్షత వహించారు. రూ.1497.14 కోట్ల అంచనాలతో రూపొందించిన 2024–25 బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ప్రధానంగా బడ్జెట్‌లో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం కల్పించారు. బడ్జెట్ అంచనాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సూచనల మేరకు కొన్ని మార్పులు, చేర్పులతో బడ్జెట్ ఆమోదం తెలుపుతున్నట్లు నగర మేయర్ వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు), షేక్ సజీల, నగర కమిషనర్ కీర్తి చేకూరి హాజరయ్యారు.

బడ్జెట్ స్వరూపం ఇలా...

	రూ.కోట్లలో
ప్రారంభ నిల్వ	668,56,61,695
జమలు	828,57,54,000
మొత్తం	1497,14,15,695
ఖర్చులు	923,47,66,400
అంత్య నిల్వ	573,66,49,295

కేటాయింపులు	రూ.కోట్లలో
సంక్షేమ పథకాలకు	224.33
పారిశుద్ధ్యం నిర్వహణకు	58.12
తాగునీటి సరఫారకు	37.02
రోడ్లు	90
ఆర్వోబీ, ఆర్‌యూబీలకు	10

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



గుంటూరు నగరంలో కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం. టీడీపీ కూడా సంతృప్తి చెందేలా వార్డులకు నిధులు కేటాయించాం. టీడీపీ సభ్యులు అభివృద్ధిని బయటకు చెప్పలేకపోతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్‌లు, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం.

– కావటి మనోహర్‌నాయుడు, నగర మేయర్

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి. కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వెచ్చించాలి. అవసరమైతే అదనంగా కేటాయింపులు చేయాలి. నార్ల ఆడిటోరియం, రెడ్ ట్యాంక్ కాంప్లెక్స్ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలి.

– కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

ఆర్‌యూబీ, ఆర్వోబీలకు కృషి

గుంటూరు నగరంలో ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలకు బడ్జెట్‌లో కేటాయింపులు మంచి విషయం. రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి నిర్మాణాలకు తగిన చొరవ తీసుకోవాలి. గ్రావిటీ ద్వారా తాగునీటి సరఫరా విధానం అమలు చేయాలి. భవిష్యత్తులో కరెంట్ కోతలు ఉన్నా తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

స్కాడా విధానం అమలు

నగరంలో సమగ్ర తాగునీటి సరఫరా కోసం స్కాడా విధానం అమలు చేయనున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ తుది అనుమతుల కోసం ఫైల్ సిద్ధం చేశాం. నగరంలో పాత పైపులైన్ల స్థానంలో నూతన పైపులైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. వార్డు సచివాలయాల వారిగా డబుల్ పైపులైన్లు గుర్తించి వాటిని డమ్మీలు చేయడం జరిగింది.

– కీర్తి చేకూరి, కమిషనర్

నగరాభివృద్ధికి పాలక వర్గం కృషి



నగర అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం కృషి చేస్తుంది. ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇదే నాకు చివరి కౌన్సిల్ సమావేశం. సభ్యులందరికి నమస్కారం. నా వలన సభ్యులు ఎవరైనా ఇబ్బంది పడితే క్షమించాలి. పాలకవర్గం సమష్టిగా మరింతగా నగరాభివృద్ధికి పాటు పడాలి.

– మొహమ్మద్ ముస్తఫా, తూర్పు ఎమ్మెల్యే

రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు



నగరంలో రూ.400 కోట్ల విలువైన పనులు చేపట్టారు. అధికార, ప్రతిపక్షాలు అనే తేడా లేకుండా పాలకవర్గం అభివృద్ధి కృషి చేస్తోంది. నా భాగస్వామ్యం ఉండడం ఆనందంగా ఉంది. ఎమ్మెల్యేగా నేను సంతృప్తిగా ఉన్నాను. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్ష.

– మద్దాళి గిరిధర్, పశ్చిమ ఎమ్మెల్యే

తాగునీటి సమస్య లేదు

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య లేదని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. స్థానిక కౌన్సిల్ హాల్‌లో బడ్జెట్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా కొంత మంది సభ్యులు తాగునీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన తాగునీటి సమస్య లేదని, పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో 98 శాతం పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధి చేసినట్లు వివరించారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో సదరు ప్రాంతంలో వీధి లైట్లు, నీటి సమస్యలు లేకుండా అధికారులు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని మేయర్ కోరారు. పవిత్ర రంజాన్‌కు నగరపాలక సంస్థ తరపున ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

బడ్జెట్ అంశాలపైనే చర్చించాలి

కొంత మంది టీడీపీ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించకుండా ఇతర అంశాలపై ప్రస్తావించడంపై మేయర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) మాట్లాడుతూ టీడీపీ సభ్యులు కావాలనే ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. బడ్జెట్‌పై చర్చ జరిగేలా చూడాలని మేయర్ కావటిని కోరారు.

బోరు పంపులు ఏర్పాటు చేయాలి

రానున్న వేసవి దృష్ట్యా నగరంలో బోరు పంపులు వేయాలని, మరమ్మతులు గురైన చోట వాటికి మరమ్మతులు చేయించాలని కార్పొరేటర్ రామనబోయిన అజయ్ సూచించారు. అదే విధంగా ప్రధాన వీధుల్లో పెద్ద లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు వెంకటలక్ష్మి, శ్రీనివాస్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగశ్రీనివాస్, ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ సుందర్రామిరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్‌రావు, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.20.91 లక్షలు



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకల లెక్కించారు. మహాశివరాత్రి అనంతరం హుండీల కానుకల లెక్కింపు దేవదాయశాఖ ఉత్సవ అధికారి పైదమ్మబాయి సమక్షంలో దేవాలయంలో ఉన్న పది హుండీలను లెక్కించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి గోపినాథశర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ.7,98,801 వచ్చినట్లు తెలిపారు. ఏడు రోజులలో వివిధ పూజా టికెట్ల ద్వారా రూ.12,86,381 ఆదాయం వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ నగదు మొత్తాన్ని వివిధ బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాకు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో దొండపాడు సేవాసమితి, గుంటూరు సేవా సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్దూ పాఠశాలలు ఒంటి పూట

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలోని ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు మంగళవారం నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఒంటి పూట తరగతులను నిర్వహించాలని డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమాంతర ఉర్దూ మాధ్యమం నిర్వహిస్తున్న పాఠశాలలు ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు. ఉప విద్యాశాఖాధికారులతో పాటు ఎంఈవోలు, హెచ్ఎంలు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

అమరేశ్వర ఆలయంలో వసంతోత్సవం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. తొలుత స్వామికి చూర్ణోత్సవ అనంతరం వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉత్సవమూర్తులకు స్నపన చేసి నూతన వస్త్రాలంకరణ చేశారు. అనంతరం స్వామికి వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7గంటలకు నిర్వహించే ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామివారి ఏకాంత సేవామహోత్సవాలు ప్రారంభమవుతాయి.

యార్డుకు 1,44,196 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,44,196 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలపి ఈ–నామ్ విధానం ద్వారా 1,33,776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.19,500 వరకు పలికింది. నాన్‌ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,700 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 1,00,209 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఓటరు అర్జీలపై యుద్ధప్రాతిపదికన చర్యలు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఉన్న ఓటరు క్లెయిమ్స్, అర్జీలు, అభ్యంతరాలు, స్పందన ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు తుది జాబితా జనవరి 22న ప్రకటించిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను పరిష్కరించడంలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. వెంటనే పెండింగ్ అర్జీలను పరిష్కరించాలన్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్స్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అనంతరం వచ్చిన 151 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, కె.స్వాతి, జిల్లా అధికారులు పరిశీలించారు.



స్పందనకు వచ్చిన ప్రజలు నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ

డబ్బులు అడిగితే దాడి చేశారు



మాకు కొందరు వ్యక్తులు రూ.25 వేలు నగదు ఇవ్వాల్సి ఉంది. వెళ్లి అడిగితే కుటుంబ సభ్యులతో సహా దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ నేను స్థానిక పోలీసుల వద్దకు వెళ్తే వారికే సపోర్ట్ చేశారు. న్యాయం చేయండి.

– జి.సుజాత, పొన్నూరు

పీఏసీఎస్‌లకు సహకారం అందిస్తాం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)లకు పూర్తి సహకారం అందించనున్నట్లు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) తెలిపారు. కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జీడీసీఎంఎస్ మహాజన సభ సమావేశం జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. తొలుత జీడీసీఎంఎస్ 2021–22 ఆడిట్ రిపోర్టు, 2023–24 జమ ఖర్చులు, 2024–25 అంచనా బడ్జెట్‌ను బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జీడీసీసీబీ చైర్మన్ రాము మాట్లాడుతూ మూడేళ్లగా సహకార రంగంలో వస్తున్న నూతన అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని సూచించారు. మారుతున్న విధివిధాలకు అనుగుణంగా సహకార సంఘాలు పనితీరు మార్చుకోవాలని కోరారు. నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటు, కంప్యూటరీకరణ, పెట్రోలు బంకులు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, తదితర వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని పీఏసీఎస్‌లు లాభాల బాట పట్టాలని కోరారు. వ్యవసాయమే దండగా అంటూ రైతులను చంద్రబాబు నట్టేట ముంచితే.. అదే వ్యవసాయాన్ని పండుగ చేసి రైతులకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు దన్నుగా నిలిచారని కొనియాడారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని చెప్పారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు, ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. రాష్ట్రంలోనే గుంటూరు డీసీఎంఎస్ ప్రథమ స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 43 డీసీఎంఎస్ సేల్స్ పాయింట్ల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగు మందుల అమ్మకాలు, ధాన్యం, మొక్కజొన్న, శనగల కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. 2023–24లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ ద్వారా రూ.37.98 కోట్ల వ్యాపారం చేసినట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముందుందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం మాట్లాడుతూ 2022–23 సంవత్సరం ఆడిట్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా డీసీఎంఎస్ పనిచేస్తోందని వెల్లడించారు. డీసీఎంఎస్ పాలకవర్గ సభ్యులు ఆరుమళ్ల వెంకట శివ, ఆరికట్ల విజయ భాస్కరరెడ్డి, ప్రసాదం బాల గురవమ్మ, పాల్వాయి ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు, జీడీసీసీబీ పాలకవర్గ సభ్యులు, డీసీఎంఎస్ కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, నిజాంపట్నం రైతు సలహా మండలి అధ్యక్షుడు యార్లగడ్డ మదన్ మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ రాము

వైఎస్ జగన్‌తోనే ముస్లింలకు న్యాయం

- మసీదుల అభివృద్ధి బాధ్యత నాది
- మంత్రి విడదల రజిని
- ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్, లైబ్రరీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు

లక్ష్మీపురం: మౌలానా అబుల్‌కలాం అజాద్ షాదీఖానాలో రూ.1.81 కోట్ల నిధులతో నిర్మించిన ఇస్లామిక్ కౌన్సిల్ సెంటర్, లైబ్రరీ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రారంభించారు. స్థానిక పట్టాభిపురంలోని నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గొప్ప పరిపాలనను అందించడం ద్వారా ముస్లింల ఆత్మ గౌరవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతీకగా నిలిచారని తెలిపారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, ముస్లిం విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని స్థిరపడ్డారన్నారు. ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపిన సూరీడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని పేర్కొన్నారు. ఆయన బాటలోనే ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో ఇదే గుంటూరు నగరంలో ముస్లిం యువకులను దేశద్రోహులుగా చిత్రించి, అరెస్టు చేసి, జైళ్లలో పెట్టారని గుర్తుచేశారు. చంద్రబాబు ఇప్పుడు మళ్లీ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుని బీజేపీతో పొత్తు కోసం వెంపర్లాడుతున్నారని దుయ్యబట్టారు. ముస్లింలంతా ఈ విషయాన్ని గమనించి, వచ్చే ఎన్నికలలో చంద్రబాబు పార్టీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఆటోనగర్ నిర్మాణం విషయంలో ఉన్న సమస్యలను తాను పరిష్కరించినట్లు వెల్లడించారు. తన సొంత నిధులతో ఖబరస్తాన్ సమకూర్చానని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని మసీదుల మరమ్మతుల బాధ్యత తీసుకుంటానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించాల్సిన బాధ్యత ముస్లింలదేనని పేర్కొన్నారు.

జగనన్న గెలిస్తేనే మంచి...: ఎమ్మెల్యే అప్పిరెడ్డి

ప్రతి సందర్భంలోనూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలు అంటూ వారి సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ప్రతి ముస్లిం ఈ విషయాన్ని గమనించాని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ముస్లింలకు మొదటినుంచీ స్నేహ హస్తం చాచి, వారి మేలు కోసం కృషి చేస్తున్నది వైఎస్సార్ సీపీయేనన్న సంగతిని గుర్తుంచుకోవాలని, ఎన్నికలప్పుడు ఎవరెన్న మాయమాటలు చెప్పినా నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

అందరికీ న్యాయం: ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

కుల, మత, పార్టీ రహితంగా అన్ని కులాలు, మతాల్లో, పార్టీల్లో అర్హులైన పేదలందరికీ న్యాయం చేస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా పెత్తందారుల పార్టీలు కూటమి కట్టాయని, వారికి వచ్చే ఎన్నికలలో గుణపాఠం చెప్పాలని కోరారు. గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర నాయుడు మాట్లాడుతూ మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి ముస్లిం అండగా ఉండాలని కోరారు. సమావేశంలో ఉలామా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్బాస్, షేక్ రోషన్, గౌరవాధ్యక్షుడు ముఫ్తీ అబ్దుల్ బాసిత్ ఖాసిం, ఉపాధ్యక్షుడు షేక్ బషీర్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహబూబ్ అహమ్మద్ పఠాన్, జాయింట్ సెక్రటరీ ఇషాక్ మొహమ్మద్, కోశాధికారి షేక్ ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.

శివ పార్వతుల తెప్పోత్సవం.. చూసిన కనులదే భాగ్యం

- పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పెదకాకాని శివాలయం వద్ద తాగునీటి చెరువులో స్వామి వార్ల తెప్పోత్సవం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దివ్య తెప్పోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. పెదకాకాని శివాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ హాజరయ్యారు. శోభాయమానంగా అలంకరించిన హంస వాహనంలో భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. తొలుత అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా గణపతి పూజలు చేశారు. తెప్పోత్సవ ప్రదేశం చెరువు కట్టపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాండ్‌లపై నుంచి అర్చకులు పంచ హారతులు ఇచ్చారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ డెప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు, పాలక వర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

లఖ్‌పతీ దీదీ పథకంతో మహిళలకు ఆర్థిక పరిపుష్టి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లఖ్‌పతీ దీదీ పథకం మధ్య తరగతి మహిళల ఆర్థిక పరిపుష్టికి ఎంతో ఉపకరిస్తుందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళతో నిర్వహించిన వర్చువల్ సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ పథకం ప్రారంభించిందన్నారు. అర్హతగల గ్రూపులను గుర్తించి వారికి వడ్డీలేని రూ.5 లక్షల రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో 879 స్వయం సహాయక బృందాలకు రూ.79.53 కోట్లు చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. ఈ మొత్తాలతో మహిళా బృందాలు వ్యాపారం ప్రారంభించి అభివృద్ధి చెందాలని కోరారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

13న ప్రధాని వర్చువల్ సమావేశం

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 13వ తేదీన వర్చువల్ విధానంలో మాట్లాడతారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా పీఎం సూరజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీన్లో ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థల లబ్ధిదారులతో ప్రధాని మాట్లాడతారని చెప్పారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. సమావేశంలో జీఎంసీ కమీషనర్ కీర్తి చేకూరి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహీపాల్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డీఎస్ఓ కోమలి పద్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని.. బండరాయితో కొట్టిచంపాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్, చిత్రంలో వెనుక ముసుగులో ఉన్న నిందితుడు

పట్నంబజారు: వ్యక్తి తలపై బండరాయితో మోది హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో పి. దేవప్రభాకర్ వివరాలను సోమ వారం మీడియాకు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన తోట శ్రీను అలియాస్ సిద్ధార్థ్ (32) చిన్ననాటి నుంచి జులాయిగా తిరుగుతూ.. తాగుడుకు బానిసగా మారాడు. కొన్ని రోజుల క్రితం గుంటూరుకు వచ్చి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ.. లాడ్జిల్లో, రోడ్లపై నిద్రిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో తెలంగాణా రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మీదేవి కాలువ గ్రామానికి చెందిన బొమ్మగాని సతీష్ క్యాటరింగ్ పనులు చేసుకునేందుకు రెండు సంవత్సరాల క్రితం గుంటూరుకు వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. అయితే నిత్యం శ్రీను మద్యం కోసం డబ్బులు లేవని సతీష్ వద్ద లాక్కుంటూ ఉండేవాడు. అనేక రకాలుగా బెదిరిస్తూ.. నిందితుడి వద్ద డబ్బులు తీసుకునే వాడని పోలీసుల తెలిపారు. మృతుడు శ్రీను వేధింపులు తట్టుకోలేని సతీష్ గత నెల 25వ తేదీ రాత్రి మృతుడికి పూటుగా మద్యం తాగించాడు. ఆదివారం సమయం.. దుకాణాలు కూడా మూసివేసి ఉండటంతో ఏలూరు బజారుకు తీసుకుని వచ్చి అక్కడ శ్రీనుపై సతీష్ దాడి చేశాడు. బండరాయితో మొహంపై గట్టిగా మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిందితుడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 10న ఏటుకూరు రోడ్డులో నిందితుడు ఉన్నాడని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు సతీష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించటంతో హత్యకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎం.సుబ్బారావు, సిబ్బంది కిరణ్, శంకర్, రవి, నజీర్, దేవభిక్షంలను ఎస్‌హెచ్‌వో దేవప్రభాకర్ అభినందించారు.

శభాష్ నాగ రఘునందన్

- ఎన్ఆర్ఐ మెడికల్ విద్యార్థికి అరుదైన గౌరవం
- చిన్నారు హృద్రోగ సమస్యలపై పరిశోధన
- జాతీయ స్థాయిలో రెండవ స్థానం



రఘునందన్‌కు బహుమతి అందజేస్తున్న ఇఖో ఇండియా ప్రెసిడెంట్ ఇలెక్ట్ డాక్టర్ విజయలక్ష్మి

తాడేపల్లిరూరల్: మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ విద్యార్థి తోట నాగ రఘునందన్‌కు అరుదైన గౌరవం లభించింది. సోమవారం మెడికల్ కాలేజీకి రావడంతో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ డాక్టర్లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు తోట నాగ రఘునందన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వాగతించారు. ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో డీఎం కార్డియాలజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తోట నాగ రఘునందన్ ఈ నెల 8,9,10 తేదీల్లో ముంబయిలో జాతీయస్థాయిలో ఇఖో ఇండియా 2024 సదస్సులో కంజినేటల్ హార్ట్ డిసీజ్ (పుట్టుకతో వచ్చే హృద్రోగ సమస్య)పై పరిశోధన చేసి రెండవ స్థానంలో నిలిచి బహుమతి సాధించారు. బెంగళూరుకు చెందిన జయదేవ ఇనిస్టిట్యూట్ మాజీ హెచ్.ఓ.డి. ఇఖో ఇండియా ప్రెసిడెంట్- ఇలెక్ట్ డాక్టర్ విజయలక్ష్మి నాగ రఘునందన్‌కు బహుమతితో పాటు పది వేల రూపాయల నగదు అందజేశారు. భవిష్యత్‌లో నాగ రఘునందన్ మరిన్ని పరిశోధనలు చేసి ఆంధ్రప్రదేశ్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రొఫెసర్లు అన్నారు.

43 మంది ఫార్మాసిస్టులకు రెగ్యులర్ ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 43 మంది ఫార్మాసిస్టులను రెగ్యులర్ చేస్తూ సోమవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జి.శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 15 మంది, ప్రకాశం జిల్లాలో 20 మంది, నెల్లూరు జిల్లాలో 8 మంది కాంట్రాక్టు గ్రేడ్-2 ఫార్మాసిస్టులను సోమవారం రెగ్యులర్ చేశారు.

స్పందనకు ఫిర్యాదుల జోరు

- హంతకులను అరెస్ట్ చేయాలని ఒకరు..
- మోసపోయానంటూ ఇంకొకరు ఎస్పీకి ఫిర్యాదు
- సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం



మహిళ సమస్య వింటున్న ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: భర్తను హత్య చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని భార్య, ఉద్యోగాల పేరుతో మోసగించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ మరోకరూ జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం (స్పందన)లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి బాధలను ఆలకించారు. అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సబ్ డివిజన్ల, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించవద్దని చెప్పారు. జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు వీవీ.నాయుడు (ట్రాఫిక్), మల్లిఖార్జునరావు (ఎస్సీ, ఎస్టీ సెల్), శ్రీనివాసరావు (డీసీఆర్బీ) కూడా బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

డబ్బులు చెల్లించడం లేదు..

బడ్డీ కొట్టుతో జీవనం చేస్తున్నా. తెలిసిన ఓ మహిళకు రూ.6 లక్షలు స్నేహపూర్వకంగా ఇచ్చా. దీనిపై పెద్దల సమక్షంలో పంచాయతీ చేయగా, కొంతమేర డబ్బులు చెల్లించేందుకు ఆమె ఒప్పుకుంది. అయితే ఆ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తోంది. స్పందనలో నాలుగుసార్లు అర్జీలు పెట్టినా ప్రయోజనం లేదు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాలి

–బి.సుజాత, పారుమళ్ళ వారివీధి.

అరెస్ట్ చేయాలి..

ఈనెల 7న గుంటూరు అరండల్‌పేట 10 వీధిలోని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయానికి భర్త నాదెండ్ల బ్రహ్మయ్యతో కలిసి వెళ్లా. భర్తతో పాటు కార్యాలయంలో ఏడుగురు ఉండగా, నేను బయట కూర్చున్నా. మధ్యాహ్నం వేళ ఇంటికెళ్లమని నాతో చెప్పగా ఇంటికి వచ్చా. తరువాత భర్త ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా కలవలేదు. మరుసటి రోజు జొన్నలగడ్డ- వెనిగండ్ల మధ్య ఎర్రవాగులో భర్త మృతదేహం పడిఉందని పోలీసులు తెలిపారు. అయితే పార్టీలో వారే భర్తను హత్య చేశారనే అనుమానం ఉంది. భర్త మొబైల్ కనిపించలేదని, ఆయనకు చివరి కాల్ ఎవరు చేశారనేది పోలీస్ దర్యాప్తులో గుర్తించి న్యాయం చేయాలి.

– నాదండ్లె బ్రహ్మయ్య భార్య సామ్రాజ్యం, కుమార్తెలు ఝాన్సీరాణి, మణిచందన, టిప్పర్ల బజార్, మంగళగిరి టౌన్.

ఉద్యోగాల పేర్లతో..

కూలీ పనులకెళ్తా. 2015లో బాపట్లకు చెందిన ఇద్దరు పరిచయమయ్యారు. కుమారుడు నాగూర్‌వలికి ఇండియన్ కోస్ట్ గ్రార్డ్ నేవీలో ఉద్యోగం యిప్పిస్తానని నమ్మబలికారు. దీంతో రెండుసార్లుగా లక్ష రూపాయలు చెల్లించా. 2019లో మరో వ్యక్తి హోం గార్డు ఉద్యోగం యిప్పిస్తానని చెబితే మరో రూ.50 వేలు చెల్లించా. ఇప్పటి వరకు ఏ ఒక్కరూ తిరిగి డబ్బులు చెల్లించ లేదు. అడిగితే సరైన సమాధానం లేదు. వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

–దూదేకుల జాన్‌సైదా, వేములూరిపాడు, ఫిరంగిపురం మండలం.

అతివేగం ప్రాణం తీసింది!



తాడేపల్లిరూరల్: స్థానిక కుంచనపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకకు చెందిన బత్తుల రాజీవ్ దుర్గాకుమార్, శివనాగ ప్రమీల కుమారుడు బత్తుల కుషిల్ (19) వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీయస్సీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అయితే తన స్నేహితుడు హర్షవర్ధన్ కారులో వస్తుండగా కుంచనపల్లి రోడ్డు వద్ద కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ఐరన్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తుల కుషిల్ తీవ్రంగా గాయపడగా హర్షవర్ధన్ స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడ్డ ఇరువురిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా కుషిల్ మృతి చెందాడు. జరిగిన ఈ సంఘటనపై తండ్రి రాజీవ్ దుర్గాకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు 727 మంది దరఖాస్తులు

విద్యా హక్కుచట్టం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు 25 వరకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లలో ప్రవేశాలకు సంబంధించి సోమవారం నాటికి 727 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు డీఈవో పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికై అనాథలు, హెచ్‌ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలు ఉచిత విద్య పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయాలతో పాటు పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అర్హులైన వారికి లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు జరుపుతామని, ఇతర వివరాలకు గ్రామ వార్డు సచివాలయాలతో పాటు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నావిస్ హెచ్ఆర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు జపాన్‌లో కేర్ వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్, కేర్ హోం ఫెసిలిటీగా ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను బెంగుళూరులో ఆర్నెల్ల కాల వ్యవధిలో జపనీస్ భాషలో శిక్షణతో పాటు ఎన్5, ఎన్4, ఎన్3 నైపుణ్యాల్లో రెసిడెన్షియల్ తరహాలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.3.50 లక్షల వ్యయం కాగల ప్రోగ్రామ్ ఫీజులో రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలు కలిసి ఉంటుందని తెలిపారు. ఇందులో అభ్యర్థి రూ.3.25 లక్షలు భరించాల్సి ఉండగా, ఏపీఎస్ఎస్‌డీసీ ఒక్కో అభ్యర్థికి రూ.25 వేలను చెల్లిస్తుందని వివరించారు. శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జపాన్ దేశం నుంచి సంబంధిత రంగానికి చెందిన నిపుణులు వచ్చి శిక్షణ కల్పిస్తారని తెలిపారు. అభ్యర్థులు చెల్లించే మొత్తానికి ఆర్నెల్ల వ్యవధిలో జపనీస్ భాషలో శిక్షణ, నైపుణ్యాలతో పాటు జపనీస్ కల్చర్, మ్యానరిజం, మర్యాదగా వ్యవహరించే విధానం, క్లయింట్ ఇంటర్వ్యూ తయారీ, పరీక్ష తయారీ, పరీక్ష రుసుం, ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూ సపోర్ట్, వీసా స్టాంపింగ్ సపోర్ట్‌తో పాటు సదరు అభ్యర్థిని జపాన్‌కు పంపే వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు వీసా కోసం డాక్యుమెంటేషన్, సహాయం కోసం ఎంబసీతో సమన్వయం, శిక్షణ ఉంటాయని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు httpr//www.aprrdc.in/home/oninePsofram Qefirtration సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 9491435004 సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన గ్రంథాలయ కార్యదర్శి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా వంకదారి సుబ్బరత్నమ్మ సోమవారం అరండల్ పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా గ్రంథాలయంలో గ్రేడ్–1 లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న సుబ్బరత్నమ్మకు ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థకు కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో గ్రంథాలయాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, ప్రజలందరూ పవిత్ర దేవాలయంగా భావించే గ్రంథాలయాన్ని మరింతగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి.సీతారామయ్య, గ్రంథపాలకులు చిన్నపరెడ్డి, దుర్గారెడ్డి, బ్రహ్మయ్య, సిబ్బంది కంపా శ్రీను, గుడారాల శ్రీను, గుడారాల శ్రీను పాల్గొన్నారు.

13న భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక భవిష్యనిధి (పీఎఫ్) ప్రాంతీయ కార్యాలయంలో ఈనెల 13న పెన్షన్ అదాలత్, ప్రయాస్ వెబినార్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్ల వారి ఫిర్యాదులు, దర్యాప్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న జరగనున్న పెన్షన్ అదాలత్‌లో సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. oguntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 949465 7469కు పంపాలని తెలిపారు.

ఆచరణలో మహిళా సాధికారత చూపిన జగనన్న

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



జెడ్పీటీసీలు, మహిళా అధికారులు, ఉద్యోగినులతో జెడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత ఆచరణలో చూపిందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా జెడ్పీ ఇంజినీరింగ్ కార్యాలయంలో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులకు ఆటల పోటీలను నిర్వహించి, బహుమతులు అందజేశారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో పయనించాలని, పురుషులతో సమానంగా పోటీతత్వంతో ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు, చర్యలతో సమాజం సైతం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినాను పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీ అధికారులు, ఉద్యోగినులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, జెడ్పీ సీఈవో సతీమణి, లక్ష్మీకుమారి, డిప్యూటీ సీఈవో సతీమణి సోనియా, కాకుమాను జెడ్పీటీసీ గుల్జాన్‌బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.219/2019/ఎ4 తేది.11-03-2024

నరసరావుపేట పురపాలక సంఘమునకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది.01-04-2024 నుండి ది.31-03-2025 వరకు ఈ దిగువ తెలిపిన మార్కెట్‌లలో ఆశీలు వసూలు చేసుకొను హక్కును గజిట్ షరతులకు లోబడి నిర్వహించుకొనుటకు గాను ది.18-03-2024 సోమవారం ఉదయం గం॥ 11.00 పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలము శ్రీయుత కమీషనర్ వారిచే గాని వారి అనుమతి పొందిన అధికారిచే గాని నిర్వహించబడును. ఏ కారణము చూపకయే వేలంను వాయిదా వేయుటకు కమీషనర్ గారికి పూర్తి అధికారం కలదు.

వ. నెం.	మార్కెట్టు వివరము	కమీషనరు/తహశీల్దారు వార్లచే జారీ చేయబడిన ఆస్తి విలువ/సాల్వెన్సీ ధృవపత్రము	వేలంపాటసమయమున ముందుగా చెల్లించవలసిన టేబుల్ ధరావత్తు
1	దినసరి కూరగాయల మార్కెట్ (హోల్‌సేల్ & రిటైల్)	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
2	సంత్రి మార్కెట్	రూ. 8,00,000.00	రూ. 1,50,000.00
3	చేపలు & మాంసం మార్కెట్	రూ. 2,00,000.00	రూ. 25,000.00
4	కబేళా – 1	రూ. 50,000.00	రూ. 25,000.00
5	కబేళా – 2	రూ. 50,000.00	రూ. 25,000.00

పాటలో పాల్గొనదలచిన వారికి సాల్వెన్సీ సర్టిఫికెట్ మరియు సబ్-రిజిస్ట్రార్ వారిచే జారీచేయబడిన ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్ లేనిచో సాల్వెన్సీ బదులుగా చూపబడిన నగదు దాఖలు చేసి వేలంలో పాల్గొనవలెను. సదరు ఆస్తికి సంబంధించి ఏ విధమైన వివాదాలు లేవని వ్యక్తిగత ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలుతో పాటుగా మరియు పాటకు ముందుగా నిర్ణయించిన ధరావత్తును నగదు రూపంలో చెల్లించి మాత్రమే వేలం పాటలో పాల్గొనవలసియుండునని తెలియజేయడమైనది.

గమనిక: ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- కమీషనర్, నరసరావుపేట మునిసిపాలిటీ.